www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 24 ఫిబ్రవరి 2023
5
ఏలూరు



వంతులవారీతో ఇబ్బందులే

ప్రజాశక్తి - గణపవరం

వరిసాగుకు వంతులవారీగా సాగునీరు ఇవ్వడం వల్ల మండలంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వరిచేలు పొట్టదశలో ఉన్నాయని, ఈ సమయంలో వరిచేలకు నీరు అవసరమన్నారు. వంతులవారీగా నీరు ఇవ్వడం వల్ల శివారు భూములకు నీరు అందకపోవడంతో రైతులు వరిసాగుకు ఇంజన్లు వేసి నీరు అందిస్తున్నారన్నారు. నీరు పూర్తిస్థాయిలో ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను అడుగుదామన్నా అధికారులు మండలంలో అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పిప్పర, చిలకంపాడు, వాకపల్లి, అగ్రహారం గ్రామాల్లో రైతులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సాగునీరు పూర్తిస్థాయిలో అందించి రైతుల ఇబ్బందులు పరిష్కరించాలని ఆయన కోరారు.

పొలం బీటలు..!

సాగు నీరందక వరి రైతుల పాట్లు వర్ణనాతీతం

రెండు జిల్లాల్లోనూ సక్రమంగా అమలుకాని వంతుల విధానం


ఇంజన్లతో నీటి తోడకానికి ఖర్చు తడిసి మోపెడు

ఆక్వా చెరువులకు సాగునీరు మళ్లింపు

నీరందక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో వరి రైతులు సాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రెండు జిల్లాల్లోనూ పరిస్థితి రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతోంది. వంతులవారీ విధానం సక్రమంగా అమలు కాకపోవడం, గోదావరి నుంచి సరిపడా నీరు రాకపోవడంతో రైతులు నానావస్థలు పడుతున్నారు. పెద్దఎత్తున సొమ్ము ఖర్చు చేసి ఇంజిన్లతో నీటిని తోడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో లక్షా పది వేల ఎకరాలుండగా, పశ్చిమగోదావరి జిల్లాలో రెండున్నర లక్షలకు పైగా ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. పొలాలన్నీ పొట్ట, ఈనిక దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో సాగునీరు అందకపోవడంతో రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గోదావరి నుంచి 3,900 క్యూసెక్కుల నీరు రెండు జిల్లాల్లో ఆయకట్టుకు విడుదలవుతోంది. పొలాలకు సరిపడా సాగునీరు అందాలంటే కనీసంగా ఐదు వేల క్యూసెక్కుల వరకూ రావాల్సి ఉంది. గోదావరి జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో సీలేరు జలాలపైనే ఆధారపడి ముందుకు సాగాల్సి వస్తోంది. ప్రస్తుతం సీలేరు నుంచి ఏడు వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే వంతుల విధానం అమలవుతోంది. అయినప్పటికీ సాగునీరు సక్రమంగా అందడం లేదు.



నిడమర్రు మండలం బువ్వనపల్లిలో సాగునీరందక బీటలు వారిన పొలం

సక్రమంగా అమలుకాని వంతుల విధానం

ప్రతి కాలువకూ ఐదు రోజుల చొప్పున వంతుల వారీ విధానం అమలు చేసేలా ప్రణాళికలు రచించారు. అయితే అది సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో రైతులు నానావస్థలు పడుతున్నారు. నిడమర్రు మండలం బువ్వనపల్లిలోని చర్చి దగ్గర పొలాలు బీటలు వారి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. గణపవరం మండలంతోపాటు డెల్టాలోని అనేక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రైతులు ఇంజిన్లు వేసి నీటిని తోడుతూ పంటను కాపాడుకుంటున్నారు. వరిపైరు పొట్ట, ఈనిక దశకు చేరడంతో నీటిఎద్దడి సమస్య రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి రానుందని బెంగపడుతున్నారు. రాత్రీ పగలు సాగునీటి కోసం కాలువల వెంబడి రైతులు పడిగాపులు పడుతున్నారు. నీటి తోడకానికి పెద్దఎత్తున ఖర్చవుతోంది. దీంతో పెట్టుబడి భారం రైతులకు పెరిగిపోతోంది. నీటి ఎద్దడి ప్రధాన కారణం ఆక్వా చెరువులకు సాగునీరు మళ్లించడమేనని రైతులు చెబుతున్నారు. వచ్చే నీటిలో సగానికిపైగా ఆక్వా చెరువుల్లోకే మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎల వద్ద, రాజకీయ నాయకుల వద్ద పలుకుబడి ఉన్నవాళ్లు తమ కాలువకు ఎక్కువ రోజులు నీరు సరఫరా చేయించుకుంటున్నారు. వంతులవారీ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో రైతులకు ఏంచేయాలో తెలియని దుస్థితి నెలకొంది. సాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



గణపవరం మండలంలో నీరందక ఇంజన్‌తో నీటితోడకం

నీరందక పొలం బీటలు వారింది

యిప్పిలి పురుషోత్తం, రైతు, బువ్వనపల్లి

బువ్వనపల్లి చర్చి సమీపంలో మూడెకరాలు సాగు చేస్తున్నాం. సాగు నీరందక పొలం అంతా బీటలు వారింది. పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. సాగునీరు సరిగ్గా అందకపోవడమే దీనికి కారణం. పొలం కాపాడుకునేందుకు ఇంజిన్లతో నీటిని తోడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

ఆయిల్ ఇంజన్లే దిక్కు

బి.రాంబాబు, చిలకంపాడు, కౌలురైతు

సాగు చేసిన పంటలకు నీరందక నానా తంటాలు పడుతున్నాం. ఇంజన్లతో తోడుకుని పంటను కాపాడుకోవాల్సి వస్తోంది. దీంతో ఖర్చు బోలెడవుతోంది. ఈ తరుణంలో సాగునీరు అందకపోవడం వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సాగునీరు అందేలా చూడాలని కోరుతున్నాం.

మామిడి పిందె రాలిపోతోంది..!

తేనెమంచు, పచ్చపురుగుల ప్రభావం - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి


ఈసారి మామిడి పూత ఆశాజనకంగా ఉంది.. దిగుబడులు అధికంగా వస్తాయనుకునేలోపు తేనెమంచు, పచ్చపురుగులు మామిడి రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. వాతావరణ మార్పులకు తేనెమంచు, పచ్చపురుగుల ఉధృతికి పిందెలు మొత్తం రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పిందే దాటి కాయగా తయారవుతున్న తరుణంలో రాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. రెండు, మూడు దఫాలుగా మందులు పిచికారీ చేసినప్పటికీ పిందె నిలవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట మండలాలైన చింతలపూడిలో 1600 ఎకరాల్లోనూ, లింగపాలెంలో 600, కామవరపు కోటలో సుమారు 200 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ప్రతీ సంవత్సరం కంటే ఈ ఏడాది ఆశించినస్థాయి కంటే మామిడి పూత వచ్చింది. కానీ ఈ పురుగుల వల్ల ప్రస్తుతం వచ్చిన పిందెలు రాలిపోతున్నాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని, దీనికితోడు ఈ ఏడాది పెట్టుబడులు కూడా అధికంగా పెట్టామని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ అవుతుందని, ప్రస్తుత పరిస్థితిని బట్టి ఎంతమేర పంట చేతికి వస్తుందో.. పెట్టుబడులు కూడా వస్తాయో, రావో కూడా తెలియడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అనుకున్న దానికంటే పెట్టుబడులు అదనంగా రూ.10 వేల వరకూ పెట్టామని చెబుతున్నారు.



నేడు ఏలూరు రానున్న చంద్రబాబు

ఉభయగోదావరి జిల్లాల నేతలతో విస్తృత సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఏలూరు విచ్చేయనున్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి క్షేత్రస్థాయిలోని క్లస్టర్, యూనిట్, మండల, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలతో సమావేశం కానున్నారు. దాదాపు మూడు వేల మంది ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు టిడిపి నాయకులు గురువారం తెలిపారు. ఏలూరు బైపాస్ రోడ్డులోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూమ్ దగ్గర్లో ఈ సమావేశం జరగనుంది. సమావేశ ఏర్పాట్లను గురువారం టిడిపి నాయకులు పితాని సత్యనారాయణ, మాగంటి బాబు, గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌తోపాటు పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశ వివరాలను వెల్లడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్షేత్రస్థాయి ఇన్‌ఛార్జులకు రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకత్వం దిశానిర్ధేశం చేయనుంది. మధ్యాహ్నంచంద్రబాబు ఈ సమావేశానికి హాజరై మాట్లాడనున్నారు.



మట్టి అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న నేతలు

మట్టి మాఫియాను అడ్డుకోలేరా : వ్యకాస

ప్రజాశక్తి - మండవల్లి

మట్టి మాఫియా విజృంభించి పచ్చని పొలాలను నాశనం చేస్తూ మట్టిని తరలిస్తుంటే రెవెన్యూ అధికారులకు పట్టకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని కొర్లపాడులో మట్టికోసం అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన చెరువులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. మద్యం, ఇసుక మాఫియా స్థాయిలో ఇక్కడ మట్టి మాఫియా రెచ్చిపోయి అనుమతులు లేకుండా మట్టిని తరలించేస్తున్నప్పటికీ పొలాలను నాశనం చేసే విధంగా ఆక్వా చెరువుగా మార్చేస్తున్నప్పటికీ అధికారులు అడ్డుకోకపోవడం బాధాకరమన్నారు. తవ్వకాలు చేపట్టిన చెరువులలోని మురుగునీరు పారేలా డ్రెయినేజీ వ్యవస్థ లేకుండా తవ్వకాలు చేపట్టడం అంతేకాకుండా చెరువుల్లో భారీ విద్యుత్ లైన్లు ఉండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే భారీస్థాయిలో ప్రాణనష్టం జరిగే పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా చెరువులకు అనుమతులు లేనప్పటికీ ఇక్కడ చెరువులు తవ్వుతున్న రెవెన్యూ శాఖ అధికారులు అడ్డుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనివల్ల పర్యావరణం పాడయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆయన తెలిపారు. నాయకుల అండదండలతోనే మట్టి మాఫియా రెచ్చిపోయి విచ్చలవిడిగా తరలించేస్తున్నారని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిస్థితులను, పంటలను, ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా చర్యలు చేపట్టి మట్టిమాఫియాను అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళిరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి


ప్రజాశక్తి - జీలుగుమిల్లి

శ్రీకాకుళం జిల్లాలో వంట చేస్తూ చీరకు నిప్పంటుకుని ప్రాణాలు కోల్పోయిన మధ్యాహ్న భోజన కార్మికురాలి కుటుంబానికి రూ.20లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ సిఐటియు అధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు మాట్లాడుతూ పాఠశాలలో విధి నిర్వహణలో మధ్యాహ్న భోజన కార్మికురాలు రమ్య మృతి బాధాకరమన్నారు. తక్షణం రమ్య కుటుంబానికి నష్టపరిహారం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయిని అనసూర్య, రోశామ్మ, కమల, మురళీ పాల్గొన్నారు.

వేసవి చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పోలవరం

వేసవి దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, దోపిడీలు జరగడానికి వేసవి కాలంలో ఎక్కువ అవకాశాలుంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి డాబాలపై, ఆరుబయట పడుకోవడం వల్ల దొంగతనాలు చేయడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందన్నారు. వీటి నివారించడానికి పెంపుడు కుక్కలను మెయిన్ డోర్ లాక్ వద్ద కట్టివేయడం, ఇంటి ఆవరణలోకి దొంగలు రావడానికి ఆస్కారం లేకుండా గోడలకు ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యలు చేపట్టడం, నూతన టెక్నాలజీ అలారం వంటివి ఏర్పాటు చేయడం వల్ల ఎవరైనా ఇంటి పరిసరాలకు వచ్చిన సందర్భంలో అవి చేసే శబ్దం వల్ల అప్రమత్తమవ్వొచ్చన్నారు. గ్రామాలకు దూరంగా, ఒంటరిగా తోటల్లో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేళకాని వేళ ఎవరైనా తలుపు తట్టినా తెలిసిన వారని నిర్ధారించుకున్న తర్వాతే తలుపులు తీయాలని సూచించారు. వేరే గ్రామాలకు కుటుంబ సమేతంగా వెళ్లే సందర్భంలో పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే ఆ నివాసాలకు రక్షణ కల్పిస్తామని, వేసవిలో దొంగతనాలు నివారించడానికి నైట్ బీట్ సేవలు మరింత విస్తృతపరుస్తున్నామని తెలిపారు. వర్తక, వాణిజ్య సంస్థలు తమషాపుల వద్ద గొడౌన్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఆలయాల వద్ద కూడా కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటి పనితీరుపై శ్రద్ధ వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఐ 94407 96664, సిఐ 9440796663, డిఎస్‌పి 7382623680 నెంబర్లకు గానీ, 100కు గానీ ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.



ప్రతిభా విద్యార్థులతో యాజమాన్యం

ఆర్ట్ కాంటెస్ట్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ ఆర్ట్ ఆన్‌లైన్ కాంటెస్ట్‌లో ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ శ్రీకాకుళం విద్యార్థులు తమ ప్రతిభను చాటినట్లు ట్రిపుల్ ఐటి నూజివీడు క్యాంపస్ అధికారులు గురువారం తెలిపారు. విద్యార్థులు కె.జ్యోత్స్న, ఎన్.దేవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే డ్రాయింగ్, పెయింటింగ్ విభాగాల్లో విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారని అధికారులు తెలిపారు. ఆర్‌జియుకెటి నూజివీడు నిర్వాహకులు ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు, పరిపాలన అధికారి ప్రదీప్, డీన్ అకాడమిక్ డాక్టర్ లక్ష్మణరావు, విద్యార్థులను అభినందించారు.



రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టి

మట్టి పోసి.. మాయ చేసి

ప్రజాశక్తి - మండవల్లి

ఫొటో చూసి 'ఇదేమిటి రోడ్డుకు అడ్డంగా మట్టిపోశారు' అని అనుకుంటున్నారా అయితే మీరు మట్టిలో కాలేసినట్టే. అక్కడ పెద్దగొయ్యి ఉందని చెప్పడానికి మాత్రమే.. ఇక్కడ కల్వర్టును ఏర్పాటు చేయడానికి గొయ్యి తవ్వి వదిలేశారు. దీంతో గుంత కనపడక మంగళవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి ఇందులో పడింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు అయ్యి అందులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీనిపై వార్త ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో గుంత కనపడకుండా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ జాగ్రత్తపడుతూ గుంతచుట్టూ బుధవారం ఎత్తుగా మట్టిపోసి చేతులు దులుపుకున్నాడు. అలాగే కుడివైపు నుంచి వెళ్లాలంటూ సూచికబోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రివేళలో ఆ దారి కనపడక వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి వస్తున్నారే తప్ప దీనిపై ప్రశ్నించకపోవడం దారుణం. ఇదిలా ఉంటే బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు స్పందించి ప్రమాదానికి కారణమైన నిర్మాణదారుడిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సి ఉంది. అలాగే ఆ ప్రాంతంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చేనేతకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈనెల 28న జిల్లాలోని అన్ని సచివాలయాల ముందు చేనేత కార్మికులు ధర్నా నిర్వహించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కాసా రత్నకుమార్, జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది చేనేతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది చేనేత కార్మికులున్నారని, ఉపవృత్తుల వారు మరో రెండు లక్షల మంది వరకూ ఉన్నారని, ఇంత చరిత్ర కలిగిన చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. చేనేత ముడి సరుకులపై జిఎస్‌టిని తొలగించాలన్నారు.

ముగిసిన ఎంఎల్‌సి నామినేషన్ల పర్వం

బరిలో 8 మంది అభ్యర్థులు-15 నామినేషన్లు దాఖలు - నేడు నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. ఈ నెల 16వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు గురువారం మరికొంత మంది నామినేషన్లు దాఖలు చేయగా అభ్యర్థులు ఎక్కువగా రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. చివరిరోజు గురువారం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సాగనుంది.

ఎనిమిది మంది అభ్యర్థులు..15 నామినేషన్లు


చివరి రోజు నామినేషన్ల దాఖలు సమయం ముగిసేటప్పటికి ఎనిమంది మంది అభ్యర్థులు 15 నామినేషన్లను దాఖలు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

1.వంకా రవీంద్రనాథ్, వైసిపి, మూడు సెట్లు
2.కవురు శ్రీనివాస్, వైసిపి, మూడు సెట్లు
3.వంకా రాజకుమారి, వైసిపి, ఒక సెట్
4.వీరవల్లి చంద్రశేఖర్, టిడిపి, రెండు సెట్లు
5.నల్లి రాజేష్, స్వతంత్ర అభ్యర్థి, మూడు సెట్లు
6.పసల వెంకటాచలం, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్
7.గోరింక దాసు, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్
8.దేవరపల్లి ఆదాం, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్

ఇంటి పరిహారం విలువ పెంచాలి

గ్రామసభలో అధికారులను నిలదీసిన 'పోలవరం' నిర్వాసితులు

ప్రజాశక్తి - కుక్కునూరు



అధికారులను నిలదీస్తున్ననిర్వాసితులు

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వంత్యాగం చేసి రోడ్డునపడ్డ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండా వ్యక్తిగత పరిహారం, ఇంటి పరిహారపు విలువలను తగ్గిస్తూ గ్రామసభల పేరుతో ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, కుక్కునూరు 'ఎ' బ్లాక్‌లో ఇంటి పరిహారపు జాబితాలో కనిపించకుండాపోయిన 116 మంది పేర్లను జాబితాలో చేర్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని నిర్వాసితులు గ్రామసభలో అధికారులను నిలదీశారు. పోలవరం ప్రాజెక్టు మొదటివిడత ముంపులోని కుక్కునూరు 'ఎ' బ్లాక్‌లో ఇంటి విలువలపై గ్రామసభ గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా సర్వేలు, గ్రామసభల పేరుతో పరిహారం చెల్లించకుండా అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మొదటి జాబితాలో ఉన్న116 పేర్లు ఇంటి పరిహారపు తుదిజాబితాలో లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పలుమార్లు సర్వేలు చేసినా116 మంది పేర్లు జాబితాలో నమోదుకాకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. వెంటనే జాబితాలోకి చేర్చాలన్నారు. మొదటి జాబితాలో ఇంటి పరిహారపు విలువ రూ.ఐదు లక్షలు ఉంటే ఈ జాబితాలో రూ.మూడు లక్షలకు తగ్గించడం సరికాదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మూడు రెట్లు పరిహారం పెంచి ఇవ్వాలని గ్రామసభ అధికారులను కోరారు. స్పందించిన అధికారులు తప్పిపోయిన పేర్లను జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

27, 28 తేదీల్లో గిరిజన జిల్లా మహాసభను జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని జగన్నాథపురంలో మార్చి 27, 28 తేదీల్లో జరిగే గిరిజన జిల్లా మహాసభను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం దిబ్బగూడెంలో కరపత్రాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలోని గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 ఎల్‌టిఆరఖ్, పీసా చట్టాలకు తూట్లు పొడుస్తూ బిజెపి ప్రభుత్వం అదాని, బడా కార్పొరేట్ సంస్థలకు గిరిజన భూములను దోచిపెట్టేందుకు ఆయుధ సామగ్రి ఫ్యాక్టరీ నిర్మాణానికి, భూములను కాజేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దానికి సంబంధించి ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా సర్వేలను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామసభలు నిర్వహించి ప్రజలఅభిప్రాయం లేకుండా భూసేకరణ చేయడం చట్టవిరుద్ధమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతంలో ఉన్న భూభాగాన్ని ఆదానీకి అప్పగించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్, కారం భాస్కర్, గుజ్జు నాగేంద్ర, తోడెం మునియ్య, గుండె గంగరాజు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పల్లెర్లమూడిలో బాలకృష్ణ వర్ధంతి సభ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డివిజన్ సీనియర్ కమ్యూనిస్టు నాయకులు గారపాటి బాలకృష్ణ వర్ధంతి సభ మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ స్మారక స్థూపం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నూజివీడు పట్టణ, ఆగిరిపల్లి, చాట్రాయి, బాపులపాడు, మండలాల కార్యదర్శులు ఎన్ఆర్. హనుమానులు, చాకిరి నాగరాజు, భాస్కర్, బేత శ్రీను, సిపిఎం సీనియర్ నాయకులు వై.దుర్గారావు, రామకృష్ణ, మరియదాసు, రాజారావు, జి.పాపారావు, బాలకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పతాకం ఎగురవేస్తున్న జి.రాజు

భవిత కేంద్రంలో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక ఎంపియుపి పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని జెడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు (సూరిబాబు) అన్నారు. గురువారం తహశీల్దార్ జెవి.సుబ్బారావుతో కలిసి ఆయన పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని, కిటికీలు, పెయింటింగ్ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు జె.శ్రీను, ఉమ్మడి తేజ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడు సిహెచ్ అగ్రహారం గ్రామంలో పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రీయ బాలస్వస్తిక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐరన్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా లెప్రసి నోడల్ పర్సన్ నామాల రాజు మాట్లాడుతూ రక్తహీనత అంటే శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గడమని చెప్పారు. మనం తీసుకోనే ఆహారాన్ని బట్టి ఆరోగ్యం ఉంటుందన్నారు. ఐరన్ లోపిస్తే కళ్ళు, నాలుక, అరచేతులు పాలిపోతాయన్నారు. తలనొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.కాంతిశ్రీ, శ్రీమంజుల, ఉపాధ్యాయులు రంగనాయకులు, యుపి స్కూలు హెచ్‌ఎం దుర్గాభవాని పాల్గొన్నారు.

ఘనంగా కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కింజరాపు ఎర్రన్నాయుడు 66వ జయంతిని టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాణిజ్య సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ సిక్కోలు సింహంగా పేరుగాంచిన ఎర్రన్నాయుడు బిసి సామజిక వర్గం నుంచి ఢిల్లీ స్థాయికి రాజకీయంగా ఎదిగారన్నారు. అనేకమందికి స్ఫూర్తిగా నిలిచిన ఎర్రన్నాయుడు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అభిరామ్, పరస రాంబాబు, అన్నప రెడ్డి గంగాధర్, తోట కుపావరం, గడి గోయల రాధాకృష్ణ, పితాని నాగు పాల్గొన్నారు.

దర్భగూడెంలో భూలక్ష్మీదేవి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెంలో భూలక్ష్మీదేవి అమ్మ వారి 48వ వార్షికోత్సవ ఉత్సవాలను సర్పంచి సున్నం ఉషారాణి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాలను ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ వారు తెలిపారు. అమ్మవారికి సర్పంచి సున్నం ఉషారాణి, సురేష్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు ఆర్థిక సాయంతో నూతన స్టేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.వెంకటేశ్వరావు, ఎస్ఐ వి.చంద్రశేఖర్, పరిమి సత్తిపండు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవ రెడ్డి, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరరావు, చౌదర రెడ్డి పాల్గొన్నారు.

లే అవుట్లకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

నగర పంచాయతీ పరిధిలో లే అవుట్లు, నూతన ఇళ్ల నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని చింతలపూడి నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లే అవుట్లకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోకుండా లే అవుట్లు వేసిన స్థలాల్లో ఎవరూ ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఇప్పటికే మూడు, నాలుగు లే అవుట్లు తప్ప మిగతా లే అవుట్ల సర్వే నెంబర్లు బ్లాక్ చేసినట్లు తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

వరిపైరుపై దోమ ఆశించే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఫణికుమార్ సూచించారు. భీమడోలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 250 ఎకరాల విస్తీర్ణంలో మేలైన యాజమాన్య పద్ధతులు అమలు చేయడం ద్వారా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పలుఅంశాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పొలంబడి క్షేత్రంలో ఆకు ముడత, కాండంతొలుచు పురుగులు పరిమిత స్థాయికి మించి ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎకరాకు ఎనిమిది కేజీల కార్టప్ హైడ్రోక్లోరైడ్‌ను 0.4 ఎంఎల్ క్లోరాంట్ర నిలీపాల్‌తో కలిపి పిచికారీ చేసి వాటిని అదుపు చేయొచ్చని సూచించారు. ఇదే క్షేత్రంలో పొడ తెగులు ఆశించే అవకాశాలున్నాయని, దీని నివారణకు పొలంగట్లపై పెరిగే కలుపు మొక్కలు తీసివేయాలని, గడ్డిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి పాల్గొన్నారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు : వైసిపి

ప్రజాశక్తి - ఏలూరు

చంద్రబాబు ప్రతీ ఎన్నికలకు కొత్తముసుగుతో వస్తారని, ఈసారి చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వైసిపి ఎంఎల్ఎలు అన్నారు. విమర్శించారు. ఏలూరులో గురువారం మీడియాతో మాట్లాడిన వారు చంద్రబాబు హయాంలో ఏలూరును అభివృద్ధి చేయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. పేద, వెనుకబడిన తరగతులకు లబ్ధి చేకూర్చి రాష్ట్రం అభివృద్ధి చేయడాన్ని చంద్రబాబు చూడలేకపోతున్నారని, అందుకే దీన్ని పక్కదారి పట్టించేందుకే గన్నవరంలో హింసాత్మక చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. చింతలపూడి ఎమ్మెల్యే విఆర్.ఎలిజా మాట్లాడుతూ రెండు రోజుల ముందు వైసిపి 18 ఎమ్మెల్సీ స్థానాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు సింహభాగం సీట్లు ప్రకటించిందని, ప్రజల్లో ఆ విషయం చేరకుండా దృష్టి మళ్లించేందుకే గన్నవరం హింసను ప్రేరేపించారని ఆరోపించారు. చంద్రబాబు 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడూ సామాజిక న్యాయం చేయలేదన్నారు. దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ఐటి పరిశ్రమలకు వైజాగ్ గమ్యస్థానమన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ఏం చేస్తుందో ప్రజలకు చెప్పగలరా అని ప్రశ్నించారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. సిఎం జగన్ హామీ మేరకు కొల్లేరులో రీసర్వే నిర్వహించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి అంటే 'నాడు-నేడు'ను చూస్తే అర్థమవుతుందన్నారు.

టిడిపిలో బిసిలకు అవమానం : మాజీ ఎమ్మెల్యే జయమంగళ


తనను ఎమ్మెల్సీగా ప్రతిపాదించినందుకు సిఎం జగన్‌కు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. 22 ఏళ్లుగా టిడిపిలో ఉండి, పనిచేస్తే అక్కడ దక్కింది శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

చింతలపూడిలో ముగిసిన స్కిల్ హబ్ శిక్షణ

30 మందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లాలోని మొదటి ఫేస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చింతలపూడి మండలంలో స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ధ్రువపత్రం, ఉద్యోగ నియామక పత్రాన్ని ఎంపిడిఒ మణికుమారి గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్నవారు వీల్స్ ఇండియా లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీలకు 30 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. వారికి నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ఎఎస్‌వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ చింతలపూడి స్కిల్ హబ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో యువతకు ఉపాధి కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. నియామక పత్రాలు అందుకున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.ప్రవీణ్, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది కిషోర్, సత్యనారాయణ, కార్తీక్, నరసరాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న శిక్షణ పొందిన యువకుడు

'సుకన్య సమృద్ధి యోజన'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ఆడపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించే అత్యుత్తమమైన పథకం సుకన్య సమృద్ధి యోజన పథకం అని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి.దుర్గారావు అన్నారు. గన్నవరంలోని కమ్యూనిటీ హాలు వద్ద సుకన్య సమృద్ధి యోజన పథకంపై, పొదుపు చేసుకునే విధానంపై గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాలు ఆర్థికంగా బలపడడానికి పొదుపు చేయడం ఒకటే మార్గమన్నారు. క్రమం తప్పకుండా పొదుపు చేయడం వల్ల పేదరికం పోతుందని, పొదుపు అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకంలో అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని పదేళ్ల ఉన్న ఆడపిల్లలు రూ.250 చెల్లించి ఖాతాదారులు కావచ్చన్నారు. ఏడేళ్ల వయసు కలిగిన ఆడపిల్లలు నెలకు రూ.500 పొదుపు చేసుకుంటే 21 ఏళ్ల తర్వాత రూ.3,17,367, రూ.రెండు వేలు పొదుపు చేసుకుంటే రూ.12,69,037 వస్తుందని ఆయన తెలిపారు. పొదుపు చేసిన సొమ్మును బట్టి లాభాలు అందుతాయని, ఆడపిల్లలకు 18 సంవత్సరాలు వచ్చిన తర్వాత ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకంలో బ్యాంకు ఖాతాదారులై ఆర్థికంగా లబ్ధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బ్యాంకు మిత్ర మద్దాల జాస్మిన్, బత్తుల సునీత, శిరీష, కరుణ, సంధ్యారాణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.




పథకంపై అవగాహన కల్పిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు

పాత్రికేయులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న పత్రిక విలేకర్లకు రూ.పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని గోపాలపురం ప్రింట్ మీడియా అధ్యక్షులు ఎ.అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామానికి చెందిన ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న తప్పెట్ల శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఇంటి వద్ద ఉన్న శ్రీనివాస్‌ను గోపాలపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు గురువారం పరామర్శించి పండ్లు, ఆ కుటుంబానికి రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిని కార్మిక చట్టం పరిధిలోకి తీసుకొచ్చి గౌరవ వేతనం ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో పాత్రికేయులకు కనీసం ఉపాధి లేకపోవడం బాధాకరమన్నారు. దీంతో విలేకర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఎన్నికల సమయంలో విలేకర్లను రాజకీయ నాయకులు పావులుగా వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం విలేకర్ల సంక్షేమానికి నిధులు కేటాయించి పాత్రికేయ కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో భాగంగా వార్తల సేకరణకు వెళ్లిన పాత్రికేయులపై దాడులకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని పాలకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ప్రజాప్రతినిధుల మాటల్లో నిజం లేదన్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి పాత్రికేయులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించడంతో పాటు, పాక్షికంగా దెబ్బతిన్న వ్యక్తికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉప అధ్యక్షులు దాసరి రామారావు, కార్యదర్శి జంగా వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శి సిర్రా కృపారావు, కోశాధికారి తిగిరిపల్లి గాబ్రియేలు, సభ్యులు ఎం.హరికృష్ణ, కొడమంచిలి మాణిక్యం, జానపాటి కిషోర్, పాముల తిరుపతిరావు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

జిల్లాస్థాయిలో భీమడోలు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో భీమడోలు హై స్కూల్ విద్యార్థులు గణిత నమూనాల ప్రదర్శనలో హ్యాట్రిక్ విజయాలను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.పుష్పావతి తెలిపారు. ప్రస్తుత సంవత్సరం ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 28 మండలాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఐదు విభాగాల్లో 119 నమూనాలను ప్రదర్శించారు. దీనిలో భాగంగా గణిత నమూనాల ప్రదర్శనలో భీమడోలు హై స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.స్నేహ గీతిక, గైడ్ టీచర్ ఎండి హసీనా బేగం సహకారంతో ప్రదర్శించిన భాగాహార యంత్రం తృతీయ స్థానాన్ని దక్కించుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. అంతకుముందు 2019లో గైడ్ టీచరుగా వ్యవహరించిన హసీనా బేగం ఆధ్వర్యంలో విద్యార్థులు తణుకులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో గణిత విభాగంలో ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్ర సాయి పోటీలకు హాజరయ్యారన్నారు. కరోనా కారణంగా తిరిగి 2022 సంవత్సరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఫిజిక్స్, లెక్కల విభాగంలో భీమడోలు విద్యార్థులు తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు. ప్రస్తుత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తిరిగి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా గైడ్ టీచరుగా వ్యవహరించిన ఎండి.హసీనాబేగం మాట్లాడుతూ భాగహార యంత్రం వల్ల విద్యార్థులకు భాగహారాలపై అవగాహన పెరుగుతుందని, లెక్కలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరిస్తుందని వివరించారు. ఈ మేరకు జిల్లాస్థాయిలో లెక్కల విభాగంలో తృతీయ స్థానం దక్కించుకున్న విద్యార్థిని పి.స్నేహ గీతికకు సహకరించిన తోటి విద్యార్థిని పి.హర్షితసుజీలను పాఠశాల ఉపాధ్యాయులు భీమడోలులో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనిల్ పాల్గొన్నారు.



తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులతో గైడ్ టీచర్ హసీనాబేగం

'సుబ్బమ్మదేవి' పూర్వవిద్యార్థుల బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి హై స్కూల్ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సుమారుగా 200 ద్విచక్ర వాహనాలతో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ స్కూల్ నుంచి అశోకస్తంభం, ఫైర్ స్టేషన్, పాతబస్టాండ్, ఎఎస్ఆర్ స్టేడియం, ఎఆర్‌డిజికె హై స్కూల్, గంగానమ్మ గుడి, 12 పంపుల సెంటర్, పవర్‌పేట రైల్వే గేట్, ఆర్ఆర్ పేట మెయిన్ రోడ్డు, జివి మాల్, నాలుగు గుళ్ల సెంటర్ , శంకరమఠం, గాంధీనగర్ స్కూల్, తంగెళ్లమూడి, బాలయోగి వంతెన మీదుగా తిరిగి సుబ్బమ్మదేవి స్కూల్‌కి చేరింది. ఈ ర్యాలీ 26వ తేదీన జరిగే వజ్రోత్సవ వేడుకకు నాందిగా ఘనంగా నిర్వహించామని పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రత్నకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్యామ్‌సన్‌రాజు, ట్రెజరర్ బిసిఆర్.మోహన్, పూర్వవిద్యార్థులు ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్, సూర్యనారాయణ, తోట శివ, మజ్జి కాంతారావు పాల్గొన్నారు.


ఏలూరు ర్యాలీ

కైకరంలో ఎర్రన్నాయుడు జయంతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి సీనియర్ నేత, మాజీమంత్రి కీర్తిశేషులు ఎర్రన్నాయుడు జయంతిని కైకరంలో గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచి సలగల గోపి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

తూడు తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

సార్వా, దాళ్వా పంటలకు పుష్కలంగా నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వచ్చే గోదావరి కాలువలో గుర్రపు డెక్క, తూడు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు నీటి పారుదల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తూడు, గుర్రపు డెక్క తొలగించే పనులను గురువారం ప్రారంభించారు. మండల పరివాహక ప్రాంతంలో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభించారు. దీంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలి

అదనంగా మరో రెండు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలని, రద్దు చేసిన 40 స్పెషలిస్ట్ వైద్య పోస్టులు, 350 బెడ్లను పునరుద్ధరించాలి, ఏలూరు, దెందులూరు, కైకలూరులో మూడు ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ ఏలూరుకు మెడికల్ కాలేజీ రావడం ఆనందించదగ్గ విషయమే అయినప్పటికీ, పాత జిల్లా ఆసుపత్రిలోనే మెడికల్ కాలేజీ ప్రారంభించడం వల్ల, ఇక్కడ ప్రజలకు ఇప్పటి వరకూ వైద్య సేవలందిస్తున్న 40 స్పెషలిస్ట్ వైద్య పోస్టులు, 150 పైగా మెడికల్ సిబ్బంది పోస్టులు, 350 బెడ్లు రద్దయ్యాయని, దీంతో ప్రజలకు వైద్య ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జిల్లా ఆసుపత్రిలో ప్రతిరోజూ ఓపి 1200 ఉంటుందని, సోమవారం వంటి రోజులలో 1800 వరకూ ఉంటుందన్నారు. ఈ క్రమంలో వైద్యసేవలు రద్దు కావడం వల్ల ఇబ్బందులు పడతారన్నారు. ఏలూరు, దెందులూరు, కైకలూరులో ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు క్షేత్రస్థాయిలో సత్వర వైద్యం అందించగలుగుతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 18 లక్షల జనాభా ఉంటే ఐదు ఏరియా ఆసుపత్రులు (భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం) ఉన్నాయని, వాటికి అదనంగా మెడికల్ కాలేజీ వస్తుందని తెలిపారు. అదే ఏలూరు జిల్లాలో 21 లక్షలు జనాభా ఉందని, నూజివీడు, జంగారెడ్డి గూడెం, చింతలపూడి మూడు ఏరియా ఆసుపత్రులే ఉన్నాయన్నారు. వీటిలో చింతలపూడిని ఇటీవలే ఏరియా ఆసుపత్రిగా ప్రకటించడం వల్ల ఇంకా పూర్తి వైద్య సేవలు ప్రారంభం కాలేదన్నారు. ఇక్కడ మెడికల్ కాలేజీ అదనంగా రాకపోగా, ఉన్న ఆసుపత్రిలోనే కేటాయించారన్నారు. మెడికల్ కాలేజీ ప్రజలకు అత్యున్నత వైద్యమే అందిస్తుంది తప్పితే, క్షేత్రస్థాయిలో సత్వర వైద్యం అందించ లేదన్నారు. ఏరియా ఆసుపత్రులే సత్వర వైద్యం అందిస్తాయన్నారు. అలాగే మెడికల్ కాలేజీ పూర్తి కావడానికి చాలా సమయం పడుతుందని, అప్పటి వరకూ ప్రజలకు వైద్య సేవలు దూరం కావాల్సిందేనా అని ప్రశ్నించారు. వైద్య నిబంధనలు ప్రకారం 2.5 లక్షలు జనాభా ఉంటే ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. దీనిప్రకారం ఏలూరులోనే రెండు ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఏలూరు, దెందులూరు, కైకలూరు శాసన సభ్యులు ఏరియా ఆసుపత్రుల ఏర్పాటు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు తీసుకొనే చర్యలు ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువగా చేసేలా ఉండాలి కానీ, ఉన్న వైద్యం దూరం చేయకూడదన్నారు. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేసి, అన్ని స్పెషాలిటీలకు పూర్తి యూనిట్ల అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు జి.రవి కిషోర్, వైఎస్ కనకారావు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం - పాలమూరు
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా

రి.క.నెం. 06/2023 **తేది.24-02-2023**

టెండరు నోటీసు

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పొలమూరు గ్రామ పంచాయితి నందు 2023-2024 సం॥మునకు అనగా (ది.1-4-2023 నుండి 31-03-2024 వరకు) ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతి పై నిర్వహించుటకు మరియు పంచాయితీకి కావలసిన సామాగ్రి సరఫరా చేయుటకు సీలు వేయబడిన టెండర్లు ది.28-02-2023 సం॥రం తేదీన గ్రామ పంచాయితీ కార్యాలయం నందు సాయంత్రం 4:00 గంటల వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గం॥ 4:30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరు దారుల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు షెడ్యూలు పొంది, టెండర్ ధరావతు చెల్లించి దాఖలు చేయవలయును. మిగిలిన విషయములు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవలెను.

షెడ్యూలు

వ.నెం.	పని వివరములు మరియు సరఫరా వివరం	కావలసిన వ్యక్తుల సంఖ్య	చేయవలసిన ధరావతు
1.	2023-2024 సం॥రంకు (1-4-2023 నుండి 31-3-2024) పారిశుధ్యపు పనులు నిర్వహించుటకు	9	50
2.	2023-2024 సం॥రంకు వాటర్ వర్క్స్ పనులు నిర్వహించుటకు (పంపు ఆపరేటర్)	2	50
3.	2023-2024 సం॥రంకు వీధి లైట్లు రిపేరు పనులు నిర్వహించుటకు (ఎలెక్ట్రిషియన్ కం స్విచ్ ఆపరేటర్)	1	50
4.	2023-2024 సం॥రంకు ఫిట్టరు పనులు నిర్వహించుటకు	1	50
5.	2023-2024 సం॥రంకు పారిశుధ్యం సామానులు సరఫరా చేయుటకు		100
6.	2023-2024 సం॥రంకు వాటర్ వర్క్స్ సామానులు మరియు చేతి పంపు సామాగ్రి సరఫరా చేయుటకు		100
7.	2023-2024 సం॥రంకు వీధి విద్యుత్ లైట్లు సామాగ్రి సరఫరా చేయుటకు		100
8.	2023-2024 సం॥రంకు స్టేషనరి సామాగ్రి సరఫరా చేయుటకు		100

గమనిక: 1. గ్రామ పంచాయితీ నిధుల నిల్వను బట్టి పేమెంట్ చెల్లించబడును.
2. టెండర్లు ఏ కారణం తెలుపకనే రద్దు చేయుటకు పంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **యస్.మోహన్‌రావు,** ఇన్‌ఛార్జ్ పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి, పొలమూరు.